RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in
# దేశ టైమ్స్ DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్ — DESHA TIMES —
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | ఆగస్టు 28 శుక్రవారం 2026 | సంపుటి : 16 | సంచిక : 204 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాష
NALGONDA | FRIDAY AUGUST 28 2026 | VOL:16 | ISSUE: 204 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# ధాన్యం నిల్వకు భారీగా సైలోలు

హైదరాబాద్: రాష్ట్రంలో పెరుగుతున్న వరి ఉత్పత్తి, ధాన్యం సేకరణకు అనుగుణంగా ఆధునిక నిల్వ సదుపాయాలను పెంచేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 5 నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు నిల్వ సామర్థ్యంతో ఆధునిక ధాన్య సైలోలను ఏర్పాటు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. భవిష్యత్‌లో ధాన్యం నిల్వ అవసరాలను తీర్చేందుకు సంప్రదాయ గోదాములపై మాత్రమే ఆధారపడటం సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు.పౌరసరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ధాన్యం సేకరణ, నిల్వ ఏర్పాట్లపై మంత్రి చర్చించారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న సైలోల ద్వారా శాస్త్రీయ పద్ధతుల్లో ధాన్యాన్ని నిల్వ చేసే సామర్థ్యాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు.

**రబీలో 90 లక్షల టన్నుల సేకరణకు సన్నద్ధత**

రానున్న రబీ సీజన్‌లో రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. దీనికి అనుగుణంగా ముందస్తు నిల్వ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. తక్షణ అవసరాల కోసం సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ వద్ద సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే ఉందని అధికారులు మంత్రికి వివరించారు.



**ఆధునిక సాంకేతికతతో సైలోలు**

కొత్తగా ఏర్పాటు చేయనున్న సైలోల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ కోసం ఆటోమేటెడ్ హ్యాండ్లింగ్ వ్యవస్థలతోపాటు యాంత్రిక రవాణా సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. నిల్వ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. దీంతో ధాన్యంలో తేమ, పురుగులు, ఇతర కారణాల వల్ల కలిగే నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

## ఏపీ, తెలంగాణ మధ్య ఉద్రిక్తత: సాగర్ గేట్లు ఎత్తేందుకు ఏపీ యత్నం.. అడ్డుకున్న తెలంగాణ అధికారులు



**నాగార్జునసాగర్ కుడికాల్వ గేట్లు తెరిచేందుకు ఏపీ అధికారుల ప్రయత్నం**

**బోర్డు అనుమతి లేదంటూ అడ్డుకున్న తెలంగాణ ఇంజనీర్లు**

**విద్యుదుత్పత్తి ద్వారా 2,000 క్యూసెక్కులు విడుదల చేసిన ఏపీ**

**దీనికి ప్రతిగా ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసిన తెలంగాణ**

ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలపై కొలిక్కిరాని చర్చలు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య మరోసారి జల వివాదం రాజుకుంది. సాగర్ కుడికాల్వ గేట్లు ఎత్తి నీటిని తీసుకునేందుకు ఏపీ అధికారులు చేసిన ప్రయత్నాన్ని తెలంగాణ ఇంజనీర్లు అడ్డుకున్నారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే గేట్లు ఎలా తెరుస్తారంటూ అడ్డుకోవడంతో ఇరు రాష్ట్రాల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది.బుధవారం ఉదయం 11:10 గంటల సమయంలో ఏపీ

(మిగతా 2వ పేజీలో..)

## నకిలీ వైద్యులపై కఠిన నిఘా.. హైదరాబాద్‌లో 12 మంది అరెస్ట్.. సజ్జనార్ తీవ్ర హెచ్చరిక

**నకిలీ వైద్యులపై హైదరాబాద్ పోలీసుల ఉక్కుపాదం**

**విద్యార్హతలు లేని కొందరు డాక్టర్లమంటూ చెలామణి అవుతున్నారన్న సజ్జనార్**

**నకిలీ డాక్టర్ల బారిన పడొద్దని ప్రజలకు హెచ్చరిక**

వైద్యం పేరుతో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులపై హైదరాబాద్ నగర పోలీసులు

(మిగతా 2వ పేజీలో..)



## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక: నేటి నుంచి లక్కీ డ్రా..

**హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ లబ్ధిదారుల ఎంపిక**

**ఆగస్టు 28 నుంచి 31 వరకు లక్కీ డ్రా ప్రత్యక్ష ప్రసారం**

**7,340 ఫ్లాట్ల కోసం 40,900 మంది మధ్య పోటీ**

**మధ్యవర్తులను నమ్మొద్దన్న అధికారులు**

**ఎంపిక కానివారికి రూ.10,000 ఈఎండీ వాపసు**



నగరంలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ (ఎల్ఐజీ ఫ్లాట్లు) లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఆగస్టు 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు పూర్తి పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనుండటం

(మిగతా 2వ పేజీలో..)

## నేపాల్ వరదలు: తెలంగాణ వాసుల కోసం ఢిల్లీలో హెల్ప్‌లైన్!

**నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలంగాణ వాసులకు అండ**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఢిల్లీలో ప్రత్యేక కేంద్రం**

**సాయం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ల విడుదల**

నేపాల్‌ను భారీ వరదలు ముంచెత్తుతున్న నేపథ్యంలో, అక్కడ చిక్కుకున్న తెలంగాణ వాసులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు

(మిగతా 2వ పేజీలో..)



# నేపాల్‌లో ఏపీ యాత్రికులు.. రంగంలోకి దిగిన మంత్రి లోకేశ్

**ఏడుగురిలో నలుగురు క్షేమం, ముగ్గురి ఆచూకీ గల్లంతు**


**క్షేమ సమాచారంపై అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష**

**యాత్రికులను రప్పించేందుకు రంగంలోకి దిగిన ప్రభుత్వం**

**ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి నిరంతర పర్యవేక్షణ**

కైలాస మానససరోవర యాత్రకు వెళ్లి నేపాల్‌లో సంభవించిన వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ యాత్రికుల పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఏడుగురు యాత్రికులలో నలుగురు సురక్షితంగా ఉండగా, మరో ముగ్గురి ఆచూకీ తెలియరాలేదని అధికారులు తెలిపారు. ఈ విషయంపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులతో మాట్లాడి తాజా వివరాలు తెలుసుకున్నారు.గల్లంతైన

(మిగతా 4వ పేజీలో..)



## అనకాపల్లి పంచధారల కొండలపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం: 'నో మైనింగ్ జోన్'గా ప్రకటన

**మైనింగ్ వల్ల పంచధారల కొండకు ముప్పు వాటిల్లుతోందంటూ పెద్ద ఎత్తున అభ్యంతరాలు**

**పురాతన క్షేత్రమైన శ్రీ ఉమా ధర్మలింగేశ్వర స్వామి దేవాలయం దెబ్బతింటుందని ఆందోళన**

పర్యావరణ పరిరక్షణ, చారిత్రక సంపద రక్షణే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకుంది. అనకాపల్లి జిల్లాలోని ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాధాన్యత కలిగిన పంచధారల కొండల ప్రాంతాన్ని అధికారికంగా 'నో మైనింగ్ జోన్'గా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



(మిగతా 4వ పేజీలో..)

తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## సంపాదకీయం

### అన్నాచెల్లెళ్ల అనుబంధానికి

# రాఖీ బంధం

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ఆత్మీయత, ప్రేమ, అనురాగం, నమ్మకానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పండుగకు సర్వం సిద్ధమైంది. అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే ఈ పండుగను కుటుంబ సభ్యులంతా ఆనందోత్సాహాలతో జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సోదరీమణులు తమ అన్నదమ్ముల చేతికి రాఖీ కట్టి, వారు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకోవడం ఈ పండుగ ప్రత్యేకత. రాఖీ కట్టిన అనంతరం అన్నదమ్ములు తమ సోదరీమణులకు కానుకలు అందిస్తూ జీవితాంతం అండగా ఉంటామని భరోసా ఇస్తారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ అన్నాచెల్లెళ్లు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకునే సందర్భం కావడంతో రాఖీ పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. దూర ప్రాంతాల్లో ఉన్న సోదరీమణులు సైతం తమ సోదరులను కలుసుకునేందుకు సొంతూళ్లకు చేరుకుంటున్నారు. దీంతో ఇళ్లలో పండుగ సందడి నెలకొంది.

**కొత్త డిజైన్లతో రాఖీల సందడి**

రాఖీ పండుగ నేపథ్యంలో నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోని మార్కెట్లు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. చిన్నారులను ఆకట్టుకునే కార్టూన్ రాఖీల నుంచి సంప్రదాయ రాఖీలు, ముత్యాలు, రాళ్లు, పూసలతో తయారు చేసిన రాఖీల వరకు వివిధ రకాల డిజైన్లు అందుబాటులోకి వచ్చాయి. సోదరుల అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన రాఖీలను కూడా వ్యాపారులు విక్రయిస్తున్నారు. దీంతో రాఖీ దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి కనిపిస్తోంది.

**కానుకలకు ప్రత్యేక ప్రాధాన్యం**

రాఖీతో పాటు సోదరీమణులకు కానుకలు ఇవ్వడం కూడా ఆనవాయితీగా వస్తోంది. దుస్తులు, చాక్లెట్లు, మిఠాయిలు, పండ్లు, గిఫ్ట్ ప్యాక్‌లతో పాటు వివిధ రకాల బహుమతులను అన్నదమ్ములు సిద్ధం చేసుకుంటున్నారు. సోదరీమణులు కూడా తమ అన్నదమ్ముల కోసం వారికి ఇష్టమైన వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. దీంతో రాఖీలతో పాటు గిఫ్ట్ షాపులు, స్వీట్ షాపులు కూడా సందడిగా మారాయి.

**కుటుంబ బంధాలను గుర్తుచేసే పండుగ**

ప్రస్తుత కాలంలో ఉద్యోగాలు, చదువులు, వ్యాపారాల కారణంగా కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాఖీ పౌర్ణమి అందరినీ ఒక్కచోట చేర్చే పండుగగా నిలుస్తోంది. ఎన్ని దూరాలు ఉన్నా అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయతలు తగ్గవని గుర్తుచేస్తూ రాఖీ బంధం మరింత బలపడుతోంది. కుటుంబ విలువలు, ఆత్మీయ సంబంధాల ప్రాధాన్యాన్ని చాటిచెప్పే ఈ పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు.

**అనుబంధమే అసలైన కానుక**

రాఖీ పండుగలో రాఖీ ఒక చిన్న దారమే అయినప్పటికీ, దానితో ముడిపడిన భావోద్వేగం ఎంతో గొప్పది. సోదరుడు--సోదరి మధ్య ప్రేమ, పరస్పర నమ్మకం, కష్టసుఖాల్లో తోడుగా నిలిచే బంధానికి ఇది ప్రతీక. ఖరీదైన కానుకల కంటే ఆప్యాయతతో పలకరించుకోవడం, ఒకరికొకరు అండగా నిలవడం, కుటుంబ సభ్యులంతా కలిసి ఆనందాన్ని పంచుకోవడమే రాఖీ పండుగ అసలైన సందేశం. ఈ నేపథ్యంలో రేపటి రాఖీ పౌర్ణమిని కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక: నేటి నుంచి లక్కీ డ్రా..

(మొదటి పేజీ తరువాయి)

గమనార్హం. హైదరాబాద్ క్యూర్ (సీయూఆర్ఈ) పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మించిన 7,340 ఫ్లాట్ల కోసం మొత్తం 60,720 దరఖాస్తులు అందాయి. వీటిని పరిశీలించిన అధికారులు 40,900 మందిని అర్హులుగా గుర్తించగా, 19,820 దరఖాస్తులను వివిధ కారణాలతో అనర్హమైనవిగా తేల్చారు. అర్హులైన దరఖాస్తుదారుల నుంచే లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఈ ప్రక్రియపై హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ వీపీ గౌతం మాట్లాడుతూ.. "లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా జరుగుతుంది. మధ్యవర్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దు. డబ్బులు తీసుకుని ఫ్లాట్ ఇప్పిస్తామని ఎవరైనా చెబితే మోసపోకండి. డ్రా ప్రక్రియను దరఖాస్తుదారులు, మీడియా ప్రతినిధుల సమక్షంలో నిర్వహిస్తున్నాం" అని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సైతం ఈ వివరాలను వెల్లడించారు. రిజర్వేషన్ల ప్రకారం (ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, శానిటేషన్ వర్కర్లు) కేటాయింపులు జరుపుతామని తెలిపారు. ఆగస్టు 28న రాయదుర్గం, కేపీహెచ్‌బీ, 29న కౌకూర్, పాటిగడ్డ, 30న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీ, బోయిన్‌పల్లి, 31న గాజులరామారం, అంబర్‌పేట, పోచారం వంటి ప్రాంతాల్లోని ఫ్లాట్లకు డ్రా నిర్వహిస్తారు. లక్కీ డ్రాలో ఫ్లాట్ పొందని వారికి వారు చెల్లించిన రూ.10,000 ఈఎండీ మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి తిరిగి జమ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దరఖాస్తుదారులు తేదీలు, లైవ్ స్ట్రీమింగ్ లింక్‌ల కోసం అధికారిక వెబ్‌సైట్లయిన ‘స్త్రష్త్రవ్.వశ్రీఖఅస్త్రుఖఖు.స్త్రశీజ.ఱఅ లేదా మీసేవా పోర్టల్‌ను సందర్శించాలని సూచించారు.

## నకిలీ వైద్యులపై కఠిన నిఘా.. హైదరాబాద్ లో 12 మంది అరెస్ట్.. సజ్జనార్ తీవ్ర హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

ఉక్కుపాదం మోపారు. నగరంలో కనీస అర్హతలు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న నకిలీ వైద్యులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 12 మందిని గుర్తించి కఠిన చర్యలు తీసుకున్నామని పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు. కనీస వైద్య విద్యార్హతలు, ఎలాంటి పరిజ్ఞానం లేని కొందరు వ్యక్తులు తాము డాక్టర్లమంటూ చెలామణి అవుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు విచక్షణారహితంగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, బీపీ, డయాబెటిస్ మందులను ఇస్తూ, ఇష్టారీతిన ఇంజక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తున్నారని తెలిపారు. ఇటువంటి శాస్త్రీయత లేని వైద్యం వల్ల బాధితుల ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలు దెబ్బతిని ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా నకిలీ డాక్టర్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. క్లినిక్ లేదా ఆసుపత్రి రిసెప్షన్ వద్ద డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ జారీ చేసిన అధికారిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉందో లేదో కచ్చితంగా గమనించాలని తెలిపారు. అలాగే వైద్యుడి బోర్డుపై పేరు, చదివిన విద్యార్హతలతో పాటు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఒకవేళ వైద్యుడి అర్హతలపై కొద్దిగా అనుమానం వచ్చినా అధికారిక వెబ్‌సైట్ ద్వారా వివరాలు చెక్ చేసుకోవచ్చని, రికార్డుల్లో వివరాలు కనిపించకపోతే ఆ వైద్యుడిని నకిలీగా పరిగణించవచ్చని స్పష్టం చేశారు. తీసుకుంటున్న చికిత్సపై సందేహాలు ఉంటే వెంటనే అర్హత కలిగిన మరో డాక్టర్ వద్ద ‘సెకండ్ ఒపీనియన్’ తీసుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాజంలో ఎవరైనా నకిలీ వైద్యులు చలామణి అవుతున్నట్లు తెలిస్తే వెంటనే ‘డయల్ 112’ కి గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో ఆడుకునే నకిలీ డాక్టర్లపై నిరంతరం తనిఖీలు, కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## నేపాల్ వరదలు: తెలంగాణ వాసుల కోసం ఢిల్లీలో హెల్ప్‌లైన్!

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్, కోఆర్డినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ద్వారా బాధితులకు అవసరమైన సహాయ సహకారాలను అందించనున్నారు. ఈ కేంద్రం ద్వారా కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ, ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం, ఇతర ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని, బాధితుల విజ్ఞప్తులపై తక్షణమే స్పందిస్తామని అధికారులు తెలిపారు. నేపాల్‌లో ఉన్న తమ కుటుంబ సభ్యులు, యాత్రికులు, పర్యాటకులతో సంబంధాలు తెగిపోయిన వారు ఈ హెల్ప్‌లైన్ కేంద్రాలను సంప్రదించాలని ప్రభుత్వం సూచించింది. సహాయం కోరే వారు బాధితుల పేరు, పాస్‌పోర్ట్ వివరాలు, మొబైల్ నంబర్, నేపాల్‌లో వారు చివరిగా ఉన్న ప్రదేశం, టూర్ ఆపరేటర్ వివరాలు, కుటుంబ సభ్యుల సంప్రదింపు సమాచారాన్ని అందించాలని అధికారులు కోరారు. హెల్ప్‌లైన్ నంబర్లు: సహాయం అవసరమైన వారు రెసిడెంట్ కమిషనర్ పీ.ఎస్. వందన (9871999044), పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సి.హెచ్. చక్రవర్తి (9949351270), లైజన్ ఆఫీసర్ జి. రక్షిత్ నాయక్ (9618597969) నంబర్లలో సంప్రదించాలని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

## నేపాల్‌లో ఏపీ యాత్రికులు.. రంగంలోకి దిగిన మంత్రి లోకేశ్

వారిలో కుప్పం ప్రాంతానికి చెందిన బాల సుబ్రహ్మణ్యం, ఈషా ఫౌండేషన్ బృందంలోని శశికుమార్, రాజ్యలక్ష్మి ఉన్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈషా ఫౌండేషన్ సభ్యుడు శశికుమార్ చివరిసారిగా చైనాలోని గైరోంగ్ ఎంబసీ వద్ద కనిపించినట్లు సమాచారం. గల్లంతైన ముగ్గురి ఆచూకీని త్వరగా కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని లోకేశ్ అధికారులను ఆదేశించారు. మరోవైపు, కర్నూలు జిల్లాకు చెందిన భాస్కర్ శాస్త్రి సహా మరో ముగ్గురు యాత్రికులు క్షేమంగానే ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. సురక్షితంగా ఉన్నవారిని వీలైనంత త్వరగా రాష్ట్రానికి తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. యాత్రికుల భద్రత, తరలింపు విషయమై భారత రాయబార కార్యాలయం, చైనా, నేపాల్ ఎంబసీలతో పాటు ఈషా ఫౌండేషన్‌తో నిరంతరం సంప్రదింపులు జరపాలని స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు, ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. యాత్రికుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### ఏపీ, తెలంగాణ మధ్య ఉద్రిక్తత: సాగర్ గేట్లు ఎత్తేందుకు ఏపీ యత్నం.. అడ్డుకున్న తెలంగాణ అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

జలవనరుల శాఖ అధికారులు నాగార్జునసాగర్ కుడికాల్వ గేట్లను ఎత్తేందుకు ప్రయత్నించారు. తమ రాష్ట్ర తాగునీటి అవసరాల కోసమే నీటిని విడుదల చేసుకుంటున్నామని వారు వాదించారు. అయితే, కృష్ణా బోర్డు అనుమతి లేకుండా గేట్లు తెరవడానికి వీల్లేదని తెలంగాణ ఇంజనీర్లు స్పష్టం చేయడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. గేట్లు ఎత్తడం సాధ్యం కాకపోవడంతో ఏపీ ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకుంది. ప్రస్తుతం సాగర్‌లో 535 అడుగుల నీటిమట్టం ఉండటంతో, కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తిని ప్రారంభించి దాని ద్వారా 2,000 క్యూసెక్కుల నీటిని తమ కాల్వకు విడుదల చేసింది. దీనికి ప్రతిగా తెలంగాణ కూడా వెంటనే స్పందించి, సాగర్ ఎడమ కాల్వ గేట్లు ఎత్తి 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసింది. వాస్తవానికి, ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలపై ఇటీవలి బోర్డు సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో నీటి విడుదలపై బోర్డు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. ఈ నేపథ్యంలో ఏపీ ఏకపక్షంగా నీటిని తీసుకోవడంపై తెలంగాణ అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై గురువారం కృష్ణా బోర్డుకు అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. గతంలో 2023 నవంబర్‌లో కూడా ఇదే తరహా వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీయడం గమనార్హం.

### అనకాపల్లి పంచధారల కొండలపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం: ‘నో మైనింగ్ జోన్’గా ప్రకటన

దీంతో ఈ కొండల పరిసరాల్లో ఎలాంటి తవ్వకాలు, క్వారీ పనులకు ఆస్కారం లేకుండా పూర్తి నిషేధం అమలులోకి వచ్చింది. ఈ ప్రాంతంలో మైనింగ్ తవ్వకాల వల్ల జీవవైవిధ్యంతో పాటు ప్రసిద్ధ పురాతన క్షేత్రమైన శ్రీ ఉమా ధర్మలింగేశ్వర స్వామి దేవాలయానికి, అక్కడి సహజ సిద్ధమైన పుణ్యతీర్థ జలధారలకు తీవ్ర ముప్పు వాటిల్లుతోందని స్థానిక ప్రజలు, పర్యావరణవేత్తల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రత్యేక విచారణకు ఆదేశించింది. తవ్వకాల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడమే కాకుండా చారిత్రక కట్టడాలకు హాని జరుగుతోందని నిర్ధారించిన అధికారులు మైనింగ్ పనులను అడ్డుకున్నారు. ప్రకృతి వనరులను కాపాడడంలో భాగంగా ఆ ప్రాంతంలో గతంలో మంజూరు చేసిన సుమారు 2.153 హెక్టార్ల క్వారీ లీజు అనుమతులను ప్రభుత్వం తక్షణమే రద్దు చేసింది. కొండల సహజ రూపురేఖలు, జీవవైవిధ్యం దెబ్బతినకుండా ఉండేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ సంచలన నిర్ణయం పట్ల స్థానిక భక్తులు, పర్యావరణ ప్రేమికులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



# ఓటరు జాబితాను పరిశీలించుకోవాలి





**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**దేశ టైమ్స్ మహబూబాబాద్, మరిపెడ ఆగస్టు 27:**

ప్రత్యేక సమగ్ర సవరణ (SSR)-2026లో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలను ప్రజలు తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలు, ఐదు మున్సిపాలిటీల పరిధిలోని వార్డుల్లో ప్రత్యేక గ్రామ, వార్డు సభలు నిర్వహించి ముసాయిదా ఓటరు జాబితాలను ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచారు. సిరోలు మండలం చిలుక్కోడు గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో కలెక్టర్ పాల్గొని ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముసాయిదా జాబితాలో తమ పేరు, చిరునామా, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో ప్రతి ఓటరు పరిశీలించుకోవాలని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ నిర్ధారణ పత్రాలను సమర్పించి ఓటు హక్కును నిర్ధారించుకోవాలని సూచించారు. ఇందుకు నెల రోజుల సమయం ఉందని, ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

అర్హులంతా నమోదు చేసుకోవాలి

జనవరి 1, 2026 నాటికి 18 ఏళ్లు నిండిన అర్హులైన యువత తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. పేరు లేకుంటే ఫారమ్-6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు కార్డులో పేరు, చిరునామా, పుట్టిన తేదీ, ఫొటో తదితర వివరాల్లో తప్పులు ఉంటే ఫారమ్-8 ద్వారా సరిచేసుకోవచ్చన్నారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలివెళ్లిన వారి పేర్లను తొలగించేందుకు ఫారమ్-7 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

ఆన్‌లైన్‌లోనూ అవకాశం

ఓటర్లు బీఎల్‌వోలతో పాటు సంబంధిత గ్రామ, వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. అలాగే Voter Helpline Appµ, NVSP వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. తప్పులు లేని, పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును నిర్ధారించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో గణేష్, తహసీల్దార్ పున్నం చందర్, సర్పంచ్ ఉడుముల వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ తేజావత్ సుధాకర్, లక్ష్మీనారాయణ, ఎంపీడీవో గౌస్ పాషా, పంచాయతీ కార్యదర్శి నాగయ్య, బీఎల్‌వోలు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి సంరక్షించాలి.. ప్రతి ఒక్కరి బాధ్యత





**దేశ టైమ్స్మహబూబాబాద్/ మరిపెడ ఆగస్టు 27**

మరిపెడ మండలంలోని నేతావత్/పర్కజాల్ తండా గ్రామపంచాయతీ పరిధిలో గురువారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భానోత్ కొండయ్య మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి మొక్కలను పెంచాలని సూచించారు.కార్యక్రమంలో వార్డు సభ్యుడు కృష్ణ, అంగన్‌వాడీ టీచర్, బీఎల్‌వో భానోత్ కవిత, సీఏ భానుమూర్తి లాల్, వార్డు సభ్యురాలు, ఆశా వర్కర్ సునీత తదితరులు పాల్గొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై గ్రామ సభ.. ఓటరు జాబితా సవరణకు ఏకగ్రీవ ఆమోదం మరిపెడ మండలంలోని నేతావత్/పర్కజాల్ తండా గ్రామపంచాయతీ పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సభకు సర్పంచ్ భానోత్ కొండయ్యతో పాటు గ్రామస్తులు హాజరయ్యారు. ఓటరు జాబితాలో పేర్ల సవరణలు, మార్పులు, చేర్పులు తదితర అంశాలపై చర్చించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు గ్రామ సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు సర్పంచ్ భానోత్ కొండయ్య తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన ఎమ్మెల్యే కుంభం

**వలిగొండ: (దేశ టైమ్స్)**

వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని గురువారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రకటించారు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా బత్తిని సహదేవ్ గౌడ్ ఉపాధ్యక్షులుగా శనిగారపు పాండు, గంధమల్ల నరసింహ, ప్రధాన కార్యదర్శిగా మామిడి సత్తిరెడ్డి, దండెం సరిత, గంగాపురం సాయిబాబా, సూదిని రాజశేఖర్ రెడ్డి, అదేవిధంగా కార్యదర్శులుగా బుగ్గ వెంకటేశం, గంగాపురం సంధ్యారాణి, కసరబోయిన నరసింహ, బండారి అనిత ,కళ్లెం బాల శంకర్ గౌడ్, రేకల బాలరాజ్ గౌడ్, ప్రకటించగా ఎక్స్ క్యూట్ మెంబర్లుగా ఏర్పుల యాదయ్య, ఎమ్మె నవ్య, ఎడవెల్లి మల్లేశం, జక్కల శోభ రాణి, దండ మల్లికార్జున్ మాదాసు రాణి ,కేసరి మహేందర్ రెడ్డి, కందుల నరేష్, కళ్లెం రాములు, ను ప్రకటించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మండల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని సూచించారు ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని అన్నారు రాష్ట్రంలో రేవంత్ సర్కార్ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని పేదలకు అందుతున్న ప్రతి పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు గత ప్రభుత్వం సాగునీటి కాలువల విషయంలో నిర్లక్ష్యం చేసిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ వ్యాప్తంగా సాగునీటి కాలు వలకు ప్రాధాన్య తని స్తూ కోట్లా ది రూపాయలను నిధులు మంజూరు చేసి సాగునీరు అందించే ప్రక్రియను చేపట్టిందని అన్నారు ఈ సందర్భంగా నూతన కార్యవర్గ నియామక పత్రాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సహదేవు కు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు వలిగొండ సింగిల్ విండో చైర్మన్ గరిసె రవి వలిగొండ ముద్దాపురం గ్రామాల సర్పంచులు కుంభం వెంకట్ పాపిరెడ్డి సామరామ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తిని లింగయ్య గంగాపురం సతీష్ రైతు సంఘం నాయకులు నరేందర్ రెడ్డి గూడూరు శ్రీధర్ రెడ్డి కాసుల గుండు దానయ్య గౌడు వెంకన్న గౌడ్ మత్స్యగిరి గుట్ట డైరెక్టర్ రాధారపు రమేష్ ఎమ్మె లింగస్వామి ఉలిపే మల్లేశం తదితర కాంగ్రెస్ నాయకులు



# బంగారు మైసమ్మ తల్లికి ఘనంగా బోనాలు

**దేశ టైమ్స్మహబూబాబాద్/ మరిపెడ ఆగస్టు 27**



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో కొలువుదీరిన బంగారు మైసమ్మ తల్లికి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. మార్కెట్ కమిటీ అధ్యక్షులు బాసిపంగు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ అధ్యక్షులు బాసిపంగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది బంగారు మైసమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిస్తే కోరిన కోర్కెలు నెరవేరి కొంగుబంగారంగా కాపాడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బంగారు మైసమ్మ తల్లి దీవెనలతో మార్కెట్ యూనియన్‌కు చెందిన వ్యాపారులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు పత్రుమియా, యూనియన్ సభ్యులు మలికాంబ, పద్మ, రాజు, లచ్చమ్మ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతు సంఘం(AIKS) మరిపెడ మండల నూతన కమిటీ ఎన్నిక అధ్యక్ష కార్యదర్శులు కందాల రమేష్,తాడూరి వీరేంకులు




**దేశ టైమ్స్మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 27**




మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని బునాహంపురం గ్రామంలో జరిగిన తెలంగాణ రైతు సంఘం ఐదో మహాసభలలో అధ్యక్ష కార్యదర్శులను ప్రకటించడం జరిగిందని AIKS జిల్లా ప్రధాన కార్యదర్శి చెట్టి వెంకన్న గారు ప్రకటించారు, ఈ కమిటీలో భాగంగా సహాయ కార్యదర్శిగా తాటికొండ అనంత చారి, నలబోలు లక్ష్మారెడ్డి, , మండల ఉపాధ్యక్షులుగా అల్లి శ్రీనివాస్ రెడ్డి బోడపట్ల రాజశేఖర్, గుడిసె తీరుమల్, కమిటీ సభ్యులుగా చెన్నబోయిన వెంకన్న, జినుక జామ్మూర్తి, సీత వెంకన్న, మొగిలి యాకన్న సభ్యులుగా ఎన్నికయ్యారు అని తెలిపారు మొత్తంగా 13 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన చల్మెడ

**రుద్రంగి ఆగస్టు27(దేశ టైమ్స్)**

రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మహ్మద్ సదుల్లా, హసీనా, రీమ్స, హసీనా గత నాలుగు రోజుల క్రితం కారు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాలను బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు గారు పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. ఒకే ప్రమాదంలో నలుగురు మృతి చెందడం చాలా బాధాకరమని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారు అన్నారు. వారి వెంట గంగం మహేష్, మంచె రాజేశం, కంటే రెడ్డి, దయ్యాల కమలాకర్, దయ్యాల నారాయణ, ఉప్పులుటి గణేష్, గసికటి కొండయ్య, నాగులపల్లి రవీందర్, కదాస్ లక్ష్మణ్, తర్రే గంగారెడ్డి, కోడిగంటి శ్యామ్, గెంటే ప్రశాంత్, తర్రే గంగారెడ్డి, ఏనుగు రాజు, రాగుట్ల నరేష్, గాజే నరేష్, రాములు, మణిదీప్, అలాగే వేములవాడ రూరల్ మండలం నాయకులు ఉన్నారు.



తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

**వలిగొండ : (దేశ టైమ్స్)**



మండలంలోని అరూరుకు చెందిన రవ్వ సత్యం ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. గురువారం అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి బుర్ర నరసింహకి 5 వేల రూపాయలు, బుర్ర శ్రీశైలం కి 2 వేల రూపాయలు, వేములకొండకు చెందిన సాంబయ్య మృతి చెందడంతో వారి కుటుంబానికి 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసారు. ఈ కార్యక్రమంలో సామ రాశీరెడ్డి, అంబటి సాయి కుమార్, అనంత చారి,వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కేరళ గ్లోబల్ హై స్కూల్లో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు

**రుద్రంగి ఆగస్టు27(దేశ టైమ్స్)**



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని స్థానిక కేరళ గ్లోబల్ హై స్కూల్లో పాఠశాల యజమాన్యం ఆధ్వర్యంలో శనివారం రోజున ముందస్తు రక్షాబంధన్ వేడుకలను విద్యార్థులు ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బాబు నంబియర్ పాఠశాల ప్రిన్సిపాల్ లతీకలు మాట్లాడుతూ,రాఖీ పండగ విశిష్టత గురించి సోదరా సోదరి బంధాల గురించి విద్యార్థులకు ఈ సందర్భంగా తెలియజేశారు విద్యార్థులు ఒకరికొకరు రక్షాబంధన్ కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు,అన్న చెల్లెళ్ళ అక్క తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగ నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ నలిగే విజయ్ కుమార్ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు......

## భూ నిర్వాసితులకు బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారాన్ని చెల్లించాలి

**వలిగొండ : (దేశ టైమ్స్)**



బునాదిగాని కాలువ విస్తరణలో రెండో విడత భూములు కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారాన్ని చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పులిగిల్లలో బునాదిగాని కాలువను పరిశీలించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందుతుందనే లక్ష్యంతో బునాది గాని కాలువను 2004లో ప్రారంభించినప్పుడు రైతులు తమ భూములు కోల్పోతున్న ప్రభుత్వం ఇచ్చే అతి తక్కువ పరిహారం తీసుకొని తమకు సాగునీరు అందుతుందని అనుకున్న నేటికీ 22 సంవత్సరాలు గడుస్తున్న ఈ కాల్వ ద్వారా వచ్చే నీటితో రైతులు కనీసం ఒక పంటను పండించలేకపోయారని, అప్పటినుండి ఇప్పటివరకు 5 మంది ఎమ్మెల్యేలు నాలుగు ప్రభుత్వాలు మారిన కాలువకు అతిగతి లేకపోయిందన్నారు. మరోవైపు ఇటీవల కాలంలో సిపిఎం రైతాంగ ఉద్యమాల కారణంగా 265 కోట్లు నిధులు మంజూరైనప్పటికీ వాటిని విడుదల చేయడంలో భూములు కోల్పోతున్న రైతాంగానికి పరిహారాన్ని అందించడంలో పనులు చేస్తున్న కాంట్రాక్టర్ లకు సరైన సమయంలో నిధులు అందకపోవడంతో 98 కిలోమీటర్లు కొనసాగాల్సిన కాలువ పనులు 25 కిలోమీటర్లు కొనసాగి మధ్యంతరంగా ఆగిపోయిన పరిస్థితులు ఉన్నాయన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 29,30,31 తేదీల్లో నిధుల విడుదలకై పాదయాత్ర, ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే త్వరతిగతిన నిధులు విడుదల చేసి భూములు కోల్పోతున్న బాధితులకు బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పైళ్ల ఘనపతి రెడ్డి,మారబోయిన నరసింహ, వేముల నాగరాజు,దొడ్డి బిక్షపతి, కొమ్మిడి సత్తిరెడ్డి,వేముల ముత్తయ్య, వేముల అమరేందర్, రైతులు శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పి వి శ్యాంసుందర్ జన్మదిన వేడుకలు

**వలిగొండ : ఆగస్టు 27 (దేశటైమ్స్)**




మండలకేంద్రంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు రాచకొండ క్రిష్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు పిఆర్ ఫౌండేషన్ చైర్మన్ పివి శ్యాంసుందర్ రావు జన్మదినశీ సందర్భముగా గురువారం కేకు కట్ చేసి పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మైసోల్ల మచ్చ గిరి,రేగురి అమరేందర్ , బచ్చు శ్రీనివాస్, మైసోల్ల రామనర్సు, ఎర్రబోలు జంగయ్య,బంగమట్ల మహేష్ , అప్పిశెట్టి సంతోష్, నాగేల్లి పాండు, బర్ల మల్లేష్, దాసు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రుద్రంగి మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన విప్ ఆది శ్రీనివాస్





**రుద్రంగి ఆగస్టు27(దేశ టైమ్స్)**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పర్యటించారు.. గ్రామ సభలో పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల లను విప్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే మాట్లాడుతూ రుద్రంగి మండల కేంద్రంలో 1,937 అనుమానాస్పద ఓట్లను జాబితాలో చేర్చారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70 లక్షల ఓట్లు తొలగించబడ్డాయని పేర్కొంటూ, తొలగించిన ఓట్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయిలో సభలు నిర్వహించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం, ప్రభుత్వం ఆధార్‌తో ఓటరు వివరాలను అనుసంధానం చేసుకునే అవకాశం కల్పించినప్పటికీ,కొంతమంది పట్టించుకోకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని విమర్శించిన ఆది శ్రీనివాస్, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందించే ప్రక్రియను చేపట్టిందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్న బియ్యం ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. సంక్షేమం, అభివృద్ధి విషయంలో తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని ఆది శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేస్తామని, మిగిలిన సమయంలో ప్రజలందరినీ కలుపుకొని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి గ్రామ సర్పంచి గండి నారాయణ తాసిల్దార్ పుష్పలత ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్ వార్డ్ మెంబర్ పూదరి మహిపాల్ తుమ్మలపల్లి నరేందర్ వార్డ్ మెంబర్స్ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు రాఖీ కట్టిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు

**రుద్రంగి ఆగస్టు27(దేశ టైమ్స్)**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు రక్షాబంధన్ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సర్పంచ్ గండి నారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎర్రం గంగనర్సయ్య, ఆది కార్తిక్, సీఐ రవీందర్, ఎస్ఐ మోతిరామ్‌లకు కూడా విద్యార్థులు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు విద్యార్థులను అభినందించి, రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరించారు. సోదరభావం, ఆప్యాయత, పరస్పర గౌరవానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.








## రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ రసాభాస/కాంగ్రెస్ బిజెపి నాయకుల తోపులాట

**రుద్రంగి ఆగస్టు27(దేశ టైమ్స్)**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి లో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్న రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది ప్రధానమంత్రి మోడి ఫోటో రేషన్ కార్డుపై లేకపోవడంతో బిజెపి నాయకులు నిరసనకు దిగారు. ఉచిత రేషన్ బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మోడీ ఇస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేషన్ కార్డులపై రేవంత్ రెడ్డి ఉత్తమ్ కుమార రెడ్డి ఫోటో పెట్టి మోడీ ఫోటో ఎందుకు పెట్టలేదని ఎమ్మెల్యే ను ప్రశ్నించారు. దింతో కాంగ్రెస్ బిజెపి నాయకుల మధ్య గొడవ జరిగింది ఒకరికొకరు పార్టీ నినాదాలు చేస్తూ తోసుకున్నరు. పోలీసులు కలుగచేసుకొని



ఇరు పార్టీల నాయకులకు సర్దిచెప్పారు.....

## బిజెపి పార్టీ ఆధ్వర్యంలో రక్షా బంధన్ వేడుకలు

**రుద్రంగి ఆగస్టు27(దేశ టైమ్స్)**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు కర్ణావత్తుల వేణు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రక్షా బంధన్ గురించి వివరించి రాఖీ కట్టించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ. "నేను నీకు రక్షా నీవు నాకు రక్షా మనం ఇద్దరం దేశానికి రక్షా"అని అన్నారు. ప్రతి ఒక్కరం దేశాన్ని, ధర్మాన్ని,ప్రకృతి ని,పంచభూతాలను,సమాజాన్ని రక్షించాలని,భారతీయతను కాపాడాలని సంకల్పంతో రాఖీ కట్టుకొని రక్షా బంధన్ జరుపుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా రాఖి పండుగ అనేది అన్న చెల్లె లు, అక్క తమ్ముడు కట్టుకునే పండుగ మాత్రమే కాదు ఈ రక్ష బంధన్ కి చాలా ప్రముఖ్యత ఉందని,రక్షా అనేది ఒక కార్యం మొదలు పెట్టినపుడు వారు విజయం సాధించి రావాలని ఒక సంకల్పంతో కట్టుకునే రక్షా నే ఇది అని,ప్రతి ఒక్కరు కూడా ప్రతి సందర్భంలో కూడా దేశ భక్తిని చాటుకొని దేశానికీ రక్షా గా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో,ప్రధాన కార్యదర్శి మల్యాల శ్రీనివాస్,నేవురి కిషన్, కాసోజి వంశీ,బలగం శ్రీదర్,గెంటే మల్లేశం, లావుడియా శ్రీనివాస్,చేట్పెల్లి జనార్దన్,గసికంటి వెంకట్,రాచకొండ రాజేశం,పాల్గొన్నారు...




Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280